# మూగ వీణ

వైశాలికి ఆ రోజు నిద్ర లేచినప్పటి నుంచి మనసేంబాగా లేదు. ఎందుకు బాగా లేదో కూడ స్పష్టంగా తేల్చుకోలేని అవస్థ. అరవయ్యేదేళ్ళ జీవితం లోని ఎన్నో ఘట్టాలు, ఎన్నోదృశ్యాలు చెదిరిన పుట్టలోంచి బిలబిలా బయటకొచ్చిన చీమల్లా ఆలోచనల్లో పాకుతున్నాయి. ఒకదానికొకటి సంబంధం లేకుండా బుర్రలో రొద చేస్తున్నాయి.

పదకొండు గంటలకి ఎవరో వస్తారట. తనని ఇంటర్వ్యూ చేయడానికి, తన జీవిత విశేషాలు చెప్పాలిట. తన జీవితం, తనలోని కృషి పట్టుదల, అంకితభావం ముందుతరాల వారికి మార్గదర్శకమవుతాయట. ఏమున్నాయి చెప్పడానికి? నిజాలన్నీ అబద్ధాలతో కప్పేసి, కష్టాలన్నీ సుఖాలుగా, బాధలే మధురస్మృతులుగా... మోసాల్ని, వంచనల్ని ప్రోత్సాహాలుగా మెప్పులుగా వర్ణించి చెప్పాలి. అబద్ధాలనే చెప్పి చెప్పి అవే నిజాలని నమ్మేసే స్థితికి వచ్చింది తను. ఇప్పుడేదేమిటో విడమర్చి ఎలా చెప్పగలదు?

వైశాలి... సినిమా పరిశ్రమలో నలభై అయిదు సంవత్సరాలుగా యథేచ్ఛగా వెలిగి, తిరుగులేని కళాకారిణిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుంది. కీర్తి, ధనం చెట్టాపట్టాలేసుకుని నడిచాయి. వయసు మళ్ళి, ఓపికతగ్గి, విశ్రాంతి తీసుకోవాల్సిన సమయంలో శరీరానికి విశ్రాంతి లభించినా, మనసులో అశాంతి మిగిలిపోయింది. సంపాదించుకున్న కీర్తి, పోగుచేసుకున్న ఆస్తి, దాచుకున్న సంపద ఇవేమీ శాంతినివ్వడం లేదు. చీరలు, నగలు, బంగళాలు, గెస్ట్‌హౌస్‌లు ఇవేమీ తృప్తినివ్వడం లేదు.

ఏ మత గురువులనాశ్రయించినా, ఎన్ని బోధనలు విన్నా, ఆశ్రమాల వెంట ఎన్నాళ్ళు తిరిగినా, తిరిగి తిరిగి గూటికి చేరగానే కందిరీగల తుట్ట కదలక మానకుండా ఉంది. డబ్బు తన చుట్టూ బిగించిన ఉచ్చులు సడలకుండా ఉన్నాయి. "ఇంతకీ నాకీ రోజు ఎందుకింత కలతగా ఉంది?"

అవును ఎవరో వస్తారట. నన్ను ఇంటర్వ్యూ చేయడానికి, వారి ప్రశ్నలకి సమాధానాలు చెప్పాలి. అబద్ధాల అందాల మాలను జాగ్రత్తగా అల్లాలి.

నిజానికి అందరికీ అన్ని నిజాలు తెలుసు. కానీ ఎవరూ పెదవి విప్పరు. తన చేతనే పదేపదే మాట్లాడిస్తారు.

వైశాలి నెమ్మదిగా లేచి షోకేస్ దగ్గరికి వెళ్ళి నిలబడింది. ఎన్నికప్పులు, ఎన్ని మెమొంటోలు, ఎన్ని సన్మాన పత్రాలు, ఎన్ని పురస్కారాలు, ఎన్ని సభలు, ఎన్ని చప్పట్లు, ఎంతమంది అభిమానలు. అవన్నీ అలా అలా వెనక్కి వెళ్ళిపోయాయి. జ్ఞాపకాలై ఇక్కడ నిలబడి పలకరిస్తున్నాయి. వెక్కిరిస్తున్నాయి.

లోపలగా, మోచెయ్యంత పొడవు మంచి గంధపు వీణ తన వైపు నిక్కి నిక్కి చూస్తోంది. అది అందంగా, ముచ్చటగా ఉన్నా పలికే వీణ కాదు. పాటను పలికించే వీణకాదు. అది తనకి మొదటిసారిగా లభించిన బహుమతి, ఆనాటి అందం వెనకదాగి ఉన్న దుఃఖం ఇప్పటికీ పలకరిస్తే పైకి రావడానికి సిద్ధంగా ఉంది.

వెంకటలక్ష్మికి రఘుతో ఆమె పద్దెనిమిదో ఏటనే పెళ్ళి జరిగింది. అప్పటికే సినిమాల్లో పని చేయడం మొదలు పెట్టిన ఆమెకి అప్పుడప్పుడు ఛాన్సులు వస్తున్నాయి. చక్కని రూపం, మృదువైన కంఠం, స్పష్టమైన మాట ఇవన్నీ ఆమెని కొద్దికాలంలోనే అందరి మన్ననలను పొందేలా చేశాయి. సినిమా కూడా కొత్తగా అప్పుడే జనంలోకి వస్తూ, పండిత పామరులని ఆశ్చర్యంలో ముంచెత్తుతున్న సమయం కావటం వల్ల పాటా, మాటా, రూపం, నటన ఉన్న వాళ్ళు దొరకటం పరిశ్రమకి కష్టం కావటం వల్ల వెంకటలక్ష్మికి అదృష్టం కలిసి వచ్చింది. కాలం కలిసి వచ్చింది.

పాత భావాలతో, కొత్త ఆశలతో ఊగిసలాడుతున్న శంకరంకి కూతురు ద్వారా డబ్బు బాగా సంపాయించగలమని గ్రహించడానికి ఎక్కువ సమయం పట్టలేదు. పాతకాలం మనిషిగా అది వద్దు ఇలా కుదరదు అంటూ కొంత హడావుడి చేసినా డబ్బు చూసి వెంటనే తగ్గిపోతూ అవస్థ పడుతున్న సమయంలో శంకరంకి రఘు కనిపించాడు. పెద్దగా చదువు లేకపోయినా ఎంతో ఉత్సాహంగా వెంకటలక్ష్మి బతుకే

తన ధ్యేయంగా ప్రమాణం చేసిన రఘుని అతను వదల్లేదు. సాంప్రదాయ సిద్ధంగా కూతురికి పెళ్ళి చేయాలని ఉంది. ఆధునికంగా ఆమె సినిమాల్లో నటించి డబ్బు సంపాయించాలని ఉంది. అందుకే ఈ రెంటినీ మూడేసి వాళ్ళిద్దరికీ పెళ్ళిచేసి ఇద్దర్నీ గుప్పెట్లో పెట్టుకుందామని ఉంది. అందుకే వెంకటలక్ష్మితో సంప్రదించనే లేదు. ఎంతటి ప్రతిభావంతురాలైనా, ఎంతటి స్వయంశక్తి గలదైనా ఆడపిల్ల ఆడపిల్లే కదా!

పితారక్షతి కౌమారే
భర్తా రక్షతి యౌవనే
రక్షంతి స్థవిరే పుత్రాః
న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి

అంటూ శంకరం గంభీరంగా సంస్కృతంలో చదివి. "నీకు రక్షణగా ఇన్నాళ్ళూ నేనున్నాను తండ్రిగా. ఇప్పుడింక నీ భర్త నిన్ను రక్షిస్తూ, నీ భవిష్యత్తు చూస్తాడు. అతనెలా చెప్తే అలా విను!" అని బోధన చేస్తూంటే అందులో తప్పేమీ లేదనిపించింది వెంకటలక్ష్మికి.

పెళ్ళిలోనే వెంకటలక్ష్మి పేరు వైశాలిగా మారింది. వేషం, భాషా అన్నీ మారాయి. ఆమెకున్న ప్రతిభ వల్ల ఎక్కువగా ఎవరి కాళ్ళూ పట్టుకోవాల్సిన అవసరం లేకుండానే ఆమెకు అవకాశాలు ఎదురు వచ్చాయి.

వచ్చిన డబ్బును తండ్రీ, భర్తా సరిసమానంగా పంచుకునేవారు. వెనక్కి తిరిగి ఇద్దరూ ఒకరినొకరు దుమ్మెత్తి పోసుకునేవారు, ఇద్దరికీ తమకి అన్యాయం జరుగుతోందని బాధగా ఉండేది.

"ఏమిటీ మీ నాన్న నా పెళ్ళాం మీద అధికారం చెలాయిస్తున్నాడు నీ మీద సర్వహక్కులూ నావి. నీ సంపాదనలో దమ్మిడీ ఇవ్వాల్సిన పని లేదు. ఏదోలే అని ఇస్తున్నాను. చెప్పు, మీ నాన్నతో!" అనేవాడు రఘు రుసరుసలాడుతూ.

"పెళ్ళిచేశాను కదా అని సంపాదన మీద హక్కులన్నీ తనవే అనుకున్నాడేమో, మగదక్షత ఉండాలని చేశాను కానీ, దమ్మిడి ఆదాయం లేని వెధవకి వేలు సంపాదించే పిల్లని వెర్రి వెధవనై కట్టబెట్టలేదు. చెప్పు, మీ ఆయనకి! గట్టిగా మాట్లాడితే విడాకు లిప్పించెయ్యగలను!" అంటూ తండ్రి.

ఇద్దరికీ ఏం సమాధానం చెప్పాలో తెలిసేది కాదు... తన పనేదో తను చూసుకునేది నిశ్శబ్దంగా.

ఉన్నట్టుండి ఒకరోజున తండ్రి కుటుంబం నుండి ఆమెను విడదీసి వేరే తీసుకెళ్ళి పోయాడు రఘు.

దాని మొగుడు దాన్ని తీసుకెళ్ళాడు. తప్పేముంది? అన్నారంతా. వైశాలి కూడా అవును కదా అనుకుంది.

కూతురు దూరమైనందుకు శంకరంకి ఏ బాధా లేదుగానీ, ఆమె సంపాదన చేజారిపోయిందనీ, అది అప్పనంగా అల్లుడి పాలైపోతోందనీ విలవిల్లాడిపోయాడు.

తండ్రి దగ్గరున్నా, భర్త దగ్గరున్నా చేయాల్సిన పని ఒకటే. డబ్బు సంపాదించటం. సెకన్లు, నిముషాలు, రోజులూ ఏ మాత్రం చెదరకుండా బిగించి డబ్బుగా మార్చటంలో మునిగిపోయాడు రఘు.

ఒక రోజున "వైశాలీ! ఈ రాత్రి మనింటికి ఒక అతిథి డిన్నర్‌కి వస్తారు. ఆయన చేతుల్లో నాలుగు సినిమాలున్నాయి. ఆయన్ని మనం స్నేహం చేసుకోవాలి!" అన్నాడు రఘు.

రఘు మాటలు అర్థం కాక తెల్లబోయి చూసింది.

"నిజమే. నీ అంత టాలెంట్ ఉన్న వారు ఎవ్వరూ లేరు. అలాగని మనం అజాగ్రత్తగా ఉంటే బోల్తా పడతాం. అది నాకిష్టం లేదు!"

అతనేం చెప్తున్నాడో అర్థం చేసుకునే ప్రయత్నంలో ఉంది వైశాలి.

"నువ్వలా వెర్రి ముఖం వెయ్యకు. సినిమా పరిశ్రమలో ఇది చాలా సహజం. నేనున్నాను. నీ ఒంటిమీద అతని చెయ్యి పడినా, నీ పేరు మీద చెడ్డ మరక పడదు. కారణం నేనున్నాను నీ భర్తగా. ఒక్క ఏడాదిలో తారా పథానికి వెళ్ళిపోవాలి. ఈ ఇంట్లో కనకవర్షం కురవాలి! వైశాలిని మించిన ఆర్టిస్టు లేదని దేశం అంతా మారుమోగిపోవాలి!"

అతను ఉద్రేకంగా పిడికిళ్ళు బిగించి చెప్తూంటే చూస్తూ ఉండిపోయింది. ఊహించని ఈ ప్రతిపాదనతో దిమ్మ తిరిగిపోయింది వైశాలికి.

ఎటూ పోవడానికి తోచలేదు. అతన్నెలా ఎదిరించాలో కూడా అర్థం కాలేదు.

అసహ్యకరమైన ఆ ఒప్పందంలోకి అడుగుపెడుతూ ఎంతో ఏడ్చింది. విలవిల్లాడిపోయింది.

"నేనిలాంటి దాన్ని కాదండి! నాకొచ్చిన పేరూ, డబ్బూ చాలు. నాకు చెప్పుకునేందుకు కూడా ఎవ్వరూ లేరు!" అంటూ అతిథి దగ్గర ఏడ్చింది.

"నీ మొగుడొట్టి వెధవ. కాకపోతే నీలాంటి ప్రతిభ గల భార్యను... ఎవరూ పరాయివాడికి అప్పగించరు!" అన్నాడు అతిథి.

"మరి, నేనిప్పుడేం చెయ్యను?" అంది ఏడుస్తూ.

అతిథి కాసేపు ఆలోచించి "నాకు నీ సౌకుమార్యమంటే ఇష్టం. నీలో ఉన్న ఆర్టిస్టుని చూస్తే ఆరాధన. ఇప్పుడు నీలో ఉన్న అమాయకత్వం, స్వచ్ఛత చూస్తుంటే మరీ అభిమానం, ఇష్టం కలుగుతున్నాయి".

వైశాలి చేతుల్లో ముఖం దాచుకుని ఏడ్చింది.

"నువ్వు నాతో సుఖంగా ఉండు. మరో మగాడు నీవైపు చూడకుండా చేస్తాను. నీ మొగుడితోసహా!" అంటూ భరోసా ఇచ్చాడు.

"అతని దగ్గర నుంచి వచ్చేస్తే నన్ను పెళ్ళి చేసుకుంటారా?" అంది అమాయకంగా.

అతను నవ్వి "నాకు పెళ్ళయి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. నువ్వంటె మోజు. అది తీర్చుకునే వీలుంది కనుక వచ్చాను. అంతేగానీ నా భార్యనీ, పిల్లల్నీ ఎలా వదులుతాను".

అతని చేతుల్లోకి వెళ్ళినందుకు, అతని చేతుల మీదుగా తనకి వచ్చిందీ దంతపు పూల వీణ. వైశాలి దాన్ని చేతుల్లోకి తీసుకుంది. లోపల బల్లి దాగి ఉన్నట్టుంది. చేతిమీద పాకింది. ఉలిక్కిపడి వీణను వదిలేసింది. అది కింద పడి రెండు ముక్కలైంది.

ఆమెను హింసించి పీల్చి పిప్పి చేసిన రఘు చచ్చిపోయి రెండేళ్ళైంది. ఆదరించిన అతిథి పోయి రెండు నెలలైంది.

తనేదో శీలం కోల్పోయాననీ, చెడిపోయాననీ ఎప్పుడూ బాధపడలేదు. తాళి కట్టినంత మాత్రాన తనని అనుభవించే హక్కు భర్తకి సమాజం ఇచ్చిందేమోగానీ, తన మనసుని జయించిన అతిథినే తను ఇష్టపడింది.

వైశాలి కళ్ళు తెరిచి చూసింది. ఎదురుగా అందమైన చలాకీ అమ్మాయి కూర్చుని ఉంది. ఆమె పెదవులపై స్వచ్ఛమైన చిరునవ్వు మెరుస్తుండగా.

"చెప్పండి, మేడమ్... మీ జీవిత విశేషాలు" అంది.

"నా భర్త రఘు కనక లేకపోతే నేనింత దాన్నయ్యేదాన్ని కాదు!" అంటూ మొదలు పెట్టింది వైశాలి.

(3-1-2000 ఆంధ్రప్రభ వీక్లీ)